సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 29 । మార్చి । 2024



బెంగ తీర్చిన భరోసా

మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. మత్స్యకార భరోసా ఐదేళ్ల పాటు అమలు చేసి అండగా నిలిచింది.


- IIలో



కళలను ఆదరించాలి

బాపూజీ కళామందిర్‌లో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి.

- IIలో



న్యూస్‌రీల్

న్యాయశాస్త్రం సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం తెలిపారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్‌లో 88 మంది 79 మంది, ఐదో సెమిస్టర్‌లో 110 మందికి 109 మంది, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్‌లో 29 మందికి 26 మంది, ఐదో సెమిస్టర్‌లో 21 మందికి 17మంది, తొమ్మిదో సెమిస్టర్‌లో 14 మందికి 13 మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఫలితాలు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

గురుకుల ప్రవేశాల గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్లు ఎస్ఎంపురం ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ శివప్రసాద్ గురువారం తెలిపారు. ఐదో తరగతి, 6,7,8 తరగతుల్లో ఖాళీసీట్లలో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీతో గడువు ముగియగా, ఏప్రిల్ 5 వరకు పెంచినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.43.09 లక్షలు



నగదు లెక్కింపును పరిశీలిస్తున్న అధికారులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి హుండీ కానుకల ద్వారా రూ.43,09,655 మేరకు ఆదాయం లభించిందని ఆలయ ఈవో/డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం అనివెట్టి మండపంలో నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27 నుంచి గురువారం వరకు మొత్తం 31 రోజులకు హుండీల్లో లభించిన ఆదాయాన్ని లెక్కించగా కరెన్సీ నోట్ల రూపంలో రూ.41,45,262, చిల్లర రూపంలో రూ.1,64,393 వరకు లభించగా, 61 గ్రాముల బంగారం, కేజీ 600 గ్రాముల వెండి వస్తువులతో పాటు పలు దేశాల కరెన్సీ కానుకల రూపంలో లభించాయి. జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు ద్వారపు అనూరాధ, ఎన్.కోటేశ్వర చౌదరి, జలగడుగుల శ్రీనివాస్, లుకలాపు గోవిందరావు, సీనియర్ అసిస్టెంట్లు కృష్ణమాచార్యులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


వలంటీర్లంటే ఆ పార్టీలకు వణుకు



రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచిన గ్రామ, వార్డు వలంటీర్లను చూస్తే టీడీపీ, జనసేన పార్టీలు భయపడుతున్నాయని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల అదృశ్యానికి వలంటీర్లు కారణమని, తమకు అధికారం ఇస్తే వలంటీర్ల వ్యవస్థను లేకుండా చేస్తామని జనసేన, టీడీపీలు అనేక సందర్భాల్లో పేర్కొన్నాయని గుర్తు చేశారు. కేవలం రూ.5వేలు గౌరవ వేతనంతో నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లు కరోనా వంటి సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి నిజాయితీగా చిత్తశుద్ధితో పనిచేస్తున్న వలంటీర్లను చూసి చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ఎందుకు భయపడుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.

సరిహద్దుల్లో నిఘా పటిష్టం



పాతపట్నం అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న సెబ్ అధికారి పాపారావు

పాతపట్నం: ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని పాతపట్నం, వసుంధర అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌లను విజయవాడ(మంగళగిరి)కు చెందిన సెబ్ ఎస్టీఎఫ్ ఏఈఎస్ పెద్దింటి పాపారావు గురువారం తన బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేయాలన్నారు. ఆయనతో పాటు సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

● ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఊపందుకుంటోంది. విజయమే లక్ష్యంగా నాయకులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి తమకే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. సామాన్యులతో పాటు వివిధ వృత్తుల వారితో మమేకమై ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయను ఆప్యాయంగా పలకరిస్తున్న తోటూరు మహిళ



సారవకోట: కార్యకర్తలతో కలిసి ప్రచారానికి వెళ్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



సంతబొమ్మాళి: లాండ్రీ షాపులో ఇస్త్రీ చేస్తున్న వైఎస్సార్ సీపీ టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్



రణస్థలం: మహంతిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఆ దౌర్జన్యకారుడికో దండం!

- ఎచ్చెర్ల కూటమి అభ్యర్థి ఎన్ఈఆర్‌పై విరుచుకుపడుతున్న టీడీపీ శ్రేణులు
- మిత్రపక్షంతో పాటు స్వపక్షంలోనూ అసమ్మతి జ్వాలలు
- దళితులపై దాడులు, భూ ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తికి పెత్తనమేంటని ప్రశ్న

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఎచ్చెర్ల బీజేపీ అభ్యర్థిగా నడికుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్)కు సీటు ఇవ్వడం అటు స్వపక్షంలో అసంతృప్తి, ఇటు మిత్రపక్షంలో వ్యక్తిగత దాడి ఎక్కువైంది. బీజేపీలో సుదీర్ఘకాలం పనిచేసిన నాయకులను కాదని 2019 ఎన్నికల తర్వాత పార్టీలోకి వచ్చిన నేతకు టిక్కెట్ ఇవ్వడమేంటని స్వపక్షమే ఆవేదనతో ఉంది. వ్యక్తిగతంగా వివాస్పదం, నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉన్న వ్యక్తికి టిక్కెట్ ఇస్తే పార్టీ పరువు ఏంకావాలని సొంత పార్టీ శ్రేణులే తప్పు పడుతున్నాయి. కూటమిలోని మిత్రపక్షమైన టీడీపీ అయితే ఎన్ఈఆర్ తీరునే తప్పు పడుతూ అటు బీజేపీ అధిష్టానానికి, ఇటు టీడీపీ అధిష్టానానికి ఇప్పటికే పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేయడంతో పాటు సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో మండిపడుతోంది. సొంతూరు బంటుపల్లిలో తనకు ఎదురుతిరిగిన వ్యక్తులపై దాడులు చేసి కొట్లాటకు కారణమైన వ్యక్తికి నియోజకవర్గం అప్పగిస్తే..సామాన్యుడు ఇక బతకలేడు.. దళితులు రోడ్డెక్కలేని పరిస్థితి వస్తుందని ఓ రేంజ్‌లో సామాజిక మాధ్యమాల్లో రగిలిపోతున్నారు. దళిత ద్రోహికి టిక్కెట్ ఇచ్చి తప్పు చేశారని.. 80 శాతానికి పైగా బీసీలున్న నియోజకవర్గంలో 0.1శాతం కూడా ఓట్లు లేని కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకుడ్ని నియోజకవర్గ ప్రజలు ఎలా స్వాగతిస్తారని ప్రశ్నిస్తూ అసమ్మతితో ఉన్న వారంతా కడిగి పారేస్తున్నారు.

అంతా నేనే..!

ఈశ్వరరావు రాజకీయ ప్రస్థానం 2012లో మొదలైంది. ఆయన తండ్రి బంటుపల్లి సర్పంచ్‌గా పోటీ చేశారు. గ్రామాన్ని తన చేతుల్లోకి తెచ్చుకుని ఎన్ఈఆర్ నియంతగా తయారయ్యారు. తాను చెప్పిందే నడవాలని ఉక్కుపాదం మోపే స్థాయికి ఎదిగారు. తనకు ఎదురొచ్చినోళ్లపై దాడులు చేయడం, కొట్లాటకు దిగటం, అక్రమంగా కేసులు బనాయించడం పరిపాటిగా మారింది. ఎన్ఈఆర్ అంటేనే దౌర్జన్యాలకు కేరాఫ్‌గా మారిపోయింది. ఒక బ్యాచ్‌ను తయారు చేసి, గొడవలకు ఉసిగొల్పి ప్రశ్నించే వారిని తన గ్రిప్‌లోకి పెట్టుకోవాలని చూసేవారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక 2015 నుంచి మరింత దౌర్జన్యాలు, దాడులు పెరిగాయి. ఆ పార్టీలో ఉంటూ రెచ్చిపోయారు. విద్యా కమిటీ ఎన్నికలు, ఆగస్టు 15 స్వాతంత్య్ర వేడుకలు, వినాయక చవితి ఉత్సవాలు, ఇతరత్రా ఉత్సవాల్లో దాడులు చేసేవారు. తన ఆలోచనలకు భిన్నంగా ఏ ఒక్కరు నడిచినా గొడవలకు పాల్పడేవారు. ఈ క్రమంలో ఎంతోమంది గాయపడ్డ సందర్భాలు ఉన్నాయి. పోలీసు స్టేషన్‌లలో అక్రమంగా కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా ఎస్సీ సామాజిక భవనం విషయంలో ఎన్నో దౌర్జన్యాలు జరిగాయి. ఆ భవనం పేరెత్తితే ఎన్ఈఆర్ నిర్వాహకాలు దళితులందరికీ గుర్తు వస్తాయి. నియోజకవర్గంలో దళితులపై దాడులు చేసే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే ఆయన ఎన్ఈఆర్ అని చెబుతారు. ఈయన తీరును నిరసిస్తూ టీడీపీ హయాంలో బీరుపేట నుంచి రణస్థలం వరకు దళితులు ర్యాలీ సైతం చేశారు. బంటుపల్లి శివారు గ్రామాలైన వేల్పులరాయి, తిరుపతిపాలెం, కంబాలపేటలో ఎన్ఈఆర్ ప్రభావం ఎక్కువగా ఉండేది. దళిత ద్రోహిగా ఆయనపై ముద్ర ఉంది. ఇలాంటి వ్యక్తికి బీజేపీ తరఫున టిక్కెట్ ఇస్తే దళితులు ఊరుకుంటారా? దళితులపై దాడులు చేసిన నాయకుడ్ని వారంతా సమర్థిస్తారా? అని మిత్రపక్షంగా ఉన్న టీడీపీ నాయకులే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు.



ఎన్ఈఆర్‌కు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న దళితులు (ఫైల్)

ఎన్ఈఆర్‌పై నమోదైన కేసులు

ఎఫ్ఐఆర్ నెంబర్	తేదీ	సెక్షన్‌లు
88/20	16-03-2020	147,307,324 ఎస్సీ/ ఎస్టీ
157/2019	03-07-19	447,506
103/2016	04-08-2016	324,448,427,506 ఎస్సీ/ ఎస్టీ -2015 యాక్ట్
230/2015	20-12-2015	323 ఎస్సీ/ఎస్టీ
252/2018	11-12-18	447/506 ఎస్సీ/ఎస్టీ
2/2015	08-01-2015	ఎస్సీ/ఎస్టీ
178/2015	20-09-2015	324,323,427
183/2015		147,148,324,323, 427,341,506 ఎస్సీ/ ఎస్టీ

పొలిటికల్ స్పాట్ లైట్

అధిష్టానానికి ఫిర్యాదులు

దాడులు చేసే సంస్కృతే కాకుండా తనకున్న డబ్బు మదంతో పోలీసులను చెప్పు చేతుల్లో పెట్టుకుని అమాయకులపై అనేక అక్రమ కేసులు బనాయించి, ఎంతోమంది యువత జీవితాలను నాశనం చేసిన ఘనత ఎన్ఈఆర్‌కు ఉందని ఇప్పటికే బీజేపీ అధిష్టానానికి, టీడీపీ అధిష్టానానికి టీడీపీ శ్రేణులతో పాటు ఎన్ఈఆర్ వ్యతిరేకులు పెద్ద ఎత్తున ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఆయనపై ఎనిమిదికి పైగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, కొన్నింటిని తనకున్న డబ్బుతో మేనేజ్ చేశారని.. కేవలం కొన్ని గ్రామాలకే పరిమితమైన ఎన్ఈఆర్ దౌర్జన్యం ఇకపై నియోజకవర్గమంతటికీ విస్తరించిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. భూఆక్రమణలకు పాల్పడ్డారని...ఆయనకు టిక్కెట్ ఇవ్వొద్దని కోరారు.

స్వపక్షంలో అసంతృప్తి..

ఎన్ఈఆర్‌పై మిత్ర పక్షమైన టీడీపీ నుంచే కాదు స్వపక్షంలోనే బీజేపీలో కూడా అసంతృప్తి ఉంది. పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన నాయకులకు కాకుండా 2019ఎన్నికల్లో ఓటమి తర్వాత టీడీపీ నుంచి వచ్చిన నాయకుడికి సీటు కట్టబెట్టడాన్ని బీజేపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. బీసీలు ఎక్కువ ఉన్న నియోజకవర్గంలో కమ్మ సామాజికవర్గానికి పెత్తనం ఇస్తే తాము ఏమైపోవాలని బీజేపీలోని బీసీలు రగిలిపోతున్నారు. పార్టీ కోసం ఎన్నాళ్లగానో పనిచేస్తున్న పైడి వేణుగోపాల్, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పతివాడ పైడినాయుడు, సువ్వారి వెంకట సన్యాసిరావు, దుక్క ఆదినారాయణ తదితర నాయకులు న్నప్పటికీ వారిని పక్కన పెట్టి కమ్మ లాబీయింగ్‌తో టిక్కెట్ దక్కించుకున్నారని బీజేపీ శ్రేణులు సైతం భగ్గుమంటున్నాయి. కాకపోతే, అధిష్టానాన్ని ధిక్కరించే పరిస్థితులేకపోవడంతో చాపకింద నీరులా అసమ్మతిని తెలియజేస్తున్నారు.

లాబీయింగ్..

ఎన్ఈఆర్‌పై అధిష్టానాలకు ఫిర్యాదులు వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. టీడీపీ రక్తానికి చెందిన ఎన్ఈఆర్ వ్యూహాత్మకంగా రక్షణ కోసం 2019 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరి సేదతీరారని.. ఇప్పుడా వ్యక్తిని తీసుకొచ్చి తమపై రుద్దడాన్ని తప్పుపడుతూ ఫిర్యాదుల్లో స్పష్టంగా పేర్కొన్న కమ్మ లాబీయింగ్ ముందు తేలిపోయింది. ముందస్తు పథకం ప్రకారం బీజేపీకి కేటాయించి, ఆ సీటు కాస్త కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఎన్ఈఆర్‌కు కట్టబెట్టేలా చేశారంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై అసమ్మతి శ్రేణులు విరుచుకుపడుతున్నాయి. 80 శాతానికి పైగా బీసీలున్న నియోజకవర్గంలో 0.1శాతం లేని కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఎన్ఈఆర్‌ను నిలబెట్టడం ఒక తప్పయితే.. దళిత ద్రోహిగా, దాడులు, గొడవలకు ప్రేరేపించి నాయకుడ్ని తాము ఎన్నుకోవాలని చెప్పడం మరో తప్పు అని టీడీపీ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి. వ్యక్తిగతంగా, సామాజికంగా మంచి పేరు లేకపోవడంతో పాటు భూ ఆక్రమణలు, క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తికి సీటు ఇవ్వడం విచారకరమంటూ అధిష్టానాలు తీసుకున్న నిర్ణయంపై టీడీపీ శ్రేణులు యుద్ధమే చేస్తున్నాయి.

ఓటరు జాబితాలో మీ పేరుందా?



మొబైల్‌లో ఓటరు వివరాలు తెలుసుకునే పేజీ

ఇచ్ఛాపురం రూరల్: సాధారణంగా తుది ఓటరు జాబితా ప్రకటించిన వెంటనే అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటును పరిశీలించుకోవాలి. అయితే తీరిక లేని ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మంది పరిశీలించడం లేదు. కొన్ని చోట్ల జాబితా అందుబాటులో ఉండటం లేదు. పోలింగ్ రోజు ఓటు వేసేందుకు వెళ్లి ఓటు లేదని గగ్గోలు పెట్టడం, అధికారులతో వాగ్వాదం చేయడం చూస్తుంటాం. అలాంటి పరిస్థితి రాకుండా ముందుగానే జాబితా పరిశీలించడం మంచిది. ఒక వేళ ఓటు లేకపోతే ఏప్రిల్ 15 వరకు నమోదుకు అవకాశం ఉన్నందున వెంటనే జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం ఎక్కడికి వెళ్లే పనిలేకుండా చేతిలో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఇలా చేయండి...

గూగుల్‌లో electoralsearch.eci.gov.in వెబ్‌పేజీలో రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం ఎంపిక చేసుకొని మీ పేరు/మొబైల్ నంబరు/ఓటరు ఎపిక్ నంబరు నమోదు చేస్తే ఇట్టే తెలిసిపోతుంది. దీంతో పాటు ఎన్నికల పోలింగ్ తేదీ, బూత్ నెంబర్‌తో సహా మనకు వివరాలు తెలుస్తాయి. ఇందుకు ఐదు నిమిషాలు సమయం కేటాయిస్తే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

2024 సమరం సన్నద్ధం

నిర్భయంగా ఓటెయ్యండి



సోంపేటలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సోంపేట: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్ దొర అన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ సోంపేట, కంచిలి మండలాల బూత్ లెవల్ అధికారులతో కలిసి గురువారం సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జింకిభద్ర వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. అనంతరం బూత్ లెవల్ అధికారులతో సమావేశమయ్యారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ ఐ.వి.రమణ, సోంపేట, కంచిలి తహసీల్దార్లు కె.విజయ్‌కుమార్, ఎంపీఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తం



అరసవల్లి: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న నాలుగు డివిజన్ల పరిధిలో రానున్న వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి ఆదేశించారు. జిల్లా సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రెండు నెలలు కీలకమని, ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన తరుణంలో విద్యుత్ శాఖా పరంగా ఎక్కడా లోపాలు, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నెట్‌వర్క్ బలోపేతం చేయాలని, ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ స్టేషన్ల విద్యుత్ సౌకర్యం శతశాతం ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 1912 కాల్‌సెంటర్ ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా క్షేత్ర స్థాయి సిబ్బందిపై డివిజనల్ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. అనంతరం సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి మాట్లాడుతూ వేసవి ప్రణాళిక సిద్ధం చేశామని, అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో డిమాండ్ మేరకు విద్యుత్‌ను నాణ్యతతో అందజేస్తున్నామని, రానున్న రెండు నెలల్లో ఎక్కడా ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఈఈలు ఎస్.బయ్యన్నాయుడు, ఎల్‌సిహెచ్ పాత్రుడు, డిప్యూటీ ఈఈ బగ్గు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

● కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

జలుమూరు/పోలాకి: హింసకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. గురువారం జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఎన్నికల్లో తేడాలొస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలు వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చల్లవానిపేటలో తనిఖీ బృందాల పని తీరును పరిశీలించి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఈయనతోపాటు తహసీల్దార్ సీహెచ్ నాగమ్మ, డీ.టీ శ్రీనివాసరావు,ఎంపీడీఓ దామోదరరావు,ఎఓ కె.సురేష్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలాకి మండలంలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పరిశీలించారు. మౌలిక వసతులపై సెక్టార్ అధికారులతో సమీక్షించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో పరిస్థితిపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని ఎస్ఐ సత్యనారాయణకు సూచించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



పోలాకిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం ఎంపీగా గెలిపించండి



వైఎస్సార్‌సీపీ నగర నాయకులతో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

● వైఎస్సార్ సీపీ శ్రేణులతో పేరాడ తిలక్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనను నిలబెట్టారని, మీ అందరి సహకారంతో నా గెలుపు సాధ్యమవుతుందని ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, 50 డివిజన్ల ఇన్‌చార్జిలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ ఎంపీ రామ్మోహన్‌నాయుడు కార్పొరేట్ పొలిటీషియన్ తప్ప సామాన్యుడి కష్టాలు తెలిసిన వ్యక్తి కాదని స్పష్టం చేశారు. కిందిస్థాయి నుంచి ప్రతి ఒక్కరి కష్టాలు తెలిసిన వ్యక్తిగా ఉన్న నన్ను ఎంపీగా గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. తనను గెలిపించి ఎంపీ సీటును జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. సమావేశంలో శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి దేవ్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, పార్టీ ముఖ్య నాయకులు సాధు వైకుంఠరావు, పొన్నాడ రుషి, మండవల్లి రవి, సక్క రామరాజు, పి.సుగుణారెడ్డి, జె.ఎం.శ్రీనివాస్, ఎంఏ రఫీ, బుక్కూరు ఉమామహేశ్వరరావు, అంధవరపు రమేష్, తారక్, రుప్ప శేషగిరి, భైరి మురళి, శ్రీనివాస్, జ్యోతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులపై దృష్టి సారించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి హామీ పథకం పెండింగ్ పనులపై దృష్టి సారించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి పనులకు సంబంధించి ఎంపీడీఓలు, పీఓలు, ఏపీఓలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్వర్జెన్సీ పనులు చేపట్టాలన్నారు. ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో సమన్వయంతో పని చేయాలన్నారు. ఎండల నేపథ్యంలో వేతనదారులు ఇబ్బంది పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలన్నారు. ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అనుసరించి పనులు చేపట్టాలన్నారు. అన్నిచోట్లా ఉపాధి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం డ్వామా పీడీ చిట్టిరాజు జిల్లాలో ఉపాధి పనుల ప్రగతిని వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డ్వామా పీడీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఈపీడీసీఎల్ డైరెక్టర్



శ్రీనివాసమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి గురువారం దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. ఈయన వెంట విద్యుత్ శాఖ ఎస్ఈ కృష్ణమూర్తి, డి–1, డి–2 ఏఈలు కమల్‌హాసన్, సురేష్‌కుమార్, జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షుడు ఉంగటి పాపారావు తదితరులున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

నందిగాం: మండలంలోని పెద్దతామరాపల్లికి చెందిన తన కుమార్తె (22)ఈ నెల 23 నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి గురువారం నందిగాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టెక్కలి వెళ్తానని చెప్పి తిరిగి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెంగ తీర్చిన భరోసా



- జిల్లాలో 70,611 మందికి వైఎస్సార్ మత్స్యకార భరోసా లబ్ధి
- ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.70.61 కోట్ల మేర పంపిణీ

అరసవల్లి:

కడలినే నమ్ముకున్న మత్స్యకారుల కష్టాన్ని గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర హామీని ఐదేళ్లు అమలు చేసి అండగా నిలిచారు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు సముద్రంలో వేట నిషేధ కాలం అమలౌతున్న నేపథ్యంలో మత్స్యకారులకు భరోసాగా జీవన భృతి కింద ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల నగదును నేరుగా వారి ఖాతాల్లో జమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట పథకాన్ని విజయవంతంగా అమలు చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే తొలిగా మత్స్యకారులకే ఈ పథకాన్ని వర్తింపజేస్తూ డీబీటీ ద్వారా నగదు జమ చేసింది. గంగపుత్రుల బెంగ తీర్చేలా వేటనిషేధ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన భరోసాపై మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంవత్సరం	లబ్ధిదారులు	వేట నిషేధ భృతి (రూ.కోట్లలో)
2019–20	13386	రూ. 13.38
2020–21	14289	రూ. 14.28
2021–22	13612	రూ. 13.61
2022–23	14043	రూ. 14.04
2023–24	15281	రూ. 15.28
మొత్తం	70,611	రూ.70.61 కోట్లు

దళారుల బెడద లేకుండా..

వేట నిషేధ కాలంలో 11 మండలాలకు చెందిన మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా వర్తింపజేశారు. గతంలో ఇచ్చిన రూ.4 వేల భృతిని ఏకంగా రూ.10 వేలకు పెంచారు. రేషన్ కార్డుకు ఒకరు చొప్పున ప్రతి మోటార్ బోటుకు యజమానితో సహా ఆరుగురు చొప్పున, నాన్ మోటరైజ్డ్ బోటుకు యజమానితో సహా ముగ్గురు మత్స్యకారులకు ఈ భరోసా పథకాన్ని వర్తింపజేశారు. మొత్తంగా 2019 నుంచి ఇప్పటివరకు మొత్తం 70,611 మంది వేట మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.70.61 కోట్లు నగదు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఎక్కడా మధ్యవర్తుల జోక్యం లేకుండా ప్రభుత్వం డీబీటీ ద్వారా నగదు జమ చేయడంతో అర్హులంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేలా జగనన్న ప్రభుత్వం పనిచేసింది. మా మత్స్యకారుల వలసలకు అడ్డుకట్ట వేసేందుకు, జిల్లా ముఖచిత్రం మార్చేందుకు మూలపేటలో భారీపోర్టు, బుడగట్లపాలెం, మంచినీళ్లపేటలో ఫిషింగ్ హార్బర్లు నిర్మాణాలు చేపడుతోంది. వచ్చే ఏడాది మళ్లీ జగనన్నే సీఎం హోదాలో వీటిని ప్రారంభించాలని కోరుకుంటున్నాం.

– కోనాడ నరిసింగరావు, డీఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు

ఐదుసార్లు అందుకున్నా...



వేటకు నిషేధ సమయంలో గత ప్రభుత్వం మాకు రూ. 4 వేలు ఇచ్చేది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వరుసగా ఐదేళ్లుగా రూ.10 వేలు చొప్పున భృతి అందించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా భృతి అందిస్తూ మత్స్యకారుల సంక్షేమ, ఉపాధికి ఈ ప్రభుత్వం బాగా పనిచేసింది. మళ్లీ ఇదే ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాం.

– బైపల్లి రామారావు, మత్స్యకారుడు, ఇసకలపాలేం

సైనికుల్లా పనిచేయాలి





పాల్గొన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం

పొందూరు: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. స్థానిక జేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా బూత్ లెవెల్‌లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతి పక్షాలు ప్రజలను మోసం చేసేందుకు మరోసారి వస్తున్నాయని, వారి మాటలు నమ్మవద్దన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనకు నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో జరిగిన అభివృద్ధి ఆయా స్థాయిల్లో వార్డు మెంబర్లు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తులు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజలకు తెలియజేయాలని కోరారు. కాళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దుంపల లక్ష్మణరావు(రామారావు), జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పార్టీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, పార్టీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్, దువ్వాడ ప్రసాదరావు, నాయకులు కిల్లాన సూర్యారావు, లోలుగు శ్రీరాముల నాయుడు, గంట్యాడ రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు



జోగారావుకు నివాళులు అర్పిస్తున్న మంత్రి అప్పలరాజు

పలాస: మండలంలోని మోదుగులపుట్టి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మద్దిల జోగారావుకు గురువారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రి సీదిరి అప్పలరాజు హాజరై పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. ఆర్మీలో సేవలందిస్తూ దేశ సరిహద్దులో రెండు రోజుల క్రితం ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎలుగు బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని చీపురపల్లి పంచాయతీ అనకాపల్లిలో ఇటీవల ఎలుగుబంట్ల దాడిలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీసీ సంఘ ప్రతినిధులు కోరారు. గురువారం మానవ హక్కుల వేదిక ప్రతినిధులు మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం అటవీ శాఖాధికారులను కలిసి వారితో మాట్లాడారు. ఉద్దాన ప్రాంతంలో ఎలుగులు నిత్యం దాడి చేస్తున్నా చర్యలు చేపట్టకపోవడం సరి కాదన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.ఢిల్లీరావు, పోతనపల్లి కామేశ్వరరావు, కోనారి ఈశ్వరమ్మ, ఇరోతు గురుమూర్తి, గండు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

టీడీపీకి కోడ్ వర్తించదా?

తెలుగుదేశం పార్టీ యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతోంది. ఎన్నికల నియమావళి ప్రకారం కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల వద్ద రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలి. జిల్లా కేంద్రంలో మాత్రం టీడీపీ కార్యాలయం బయట ఎన్టీఆర్ విగ్రహాలకు, నాయకుల ఫ్లెక్సీలకు ఎలాంటి ముసుగులు వేయలేదు. రోడ్డుపై వెళ్తున్న వారికి బహిరంగంగా విగ్రహాలు కనిపిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం





'తూర్పుకాపులకు తీవ్ర అన్యాయం'



మాట్లాడుతున్న లోలుగు రాజశేఖర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో అత్యధికంగా తూర్పుకాపులున్నా టిక్కెట్లు కేటాయించకుండా టీడీపీ తీవ్ర అన్యాయానికి గురి చేసిందని సీనియర్ అడ్వకేట్ లోలుగు రాజశేఖర్ అన్నారు. విజయనగరం ఎంపీ స్థానం గేదెల శ్రీనుబాబుకి ఇస్తామని చెప్పి ఇవ్వకుండా నట్టేట ముంచారని, ఎచ్చెర్ల ఎమ్మెల్యే సీటు సీనియర్ నాయకుడు కిమిడి కళావెంకటరావుకి ఇవ్వలేదని, పాతపట్నం సీటును కలమట వెంకటరమణకు ఇవ్వకుండా విస్మరించారని దుయ్యబట్టారు. తూర్పుకాపులంతా తగిన బుద్ధి చెప్పకతప్పదన్నారు. ఇదే బాణీ కొనసాగిస్తే తూర్పుకాపులంతా ఏకమై ప్రతిఘటించక తప్పదని హెచ్చరించారు.

కళలను ఆదరించాలి



ఎడారిలో వానచినుకు నాటికలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ కళలను ఆదరించాలని, నాటక కళను బతికించేందుకు సుమిత్రా కళాసమితి చేస్తున్న కృషి ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఇప్పిలి బాలభాస్కరరావు స్మారక జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు మండవిల్లి రవి, ముఖ్య అతిథి బాడాన దేవభూషణరావులు మాట్లాడుతూ రంగస్థలాన్ని ప్రజలే ఆదరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, సుమిత్రా కళాసమితి అధ్యక్ష కార్యదర్శులు ఇప్పిలి శంకర శర్మ, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, కిల్లా ఫల్గుణరావు, వి.వి.ఆర్.మూర్తి, కె.సురేష్, యు.పూజ, రాజు, ప్రధాన విజయరామ్, ఎం.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొకలూరు, శ్రీసాయి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'కౌసల్యా సుప్రజా రామా', కాకినాడకు చెందిన సాయి కార్తీక్ క్రియేషన్స్ వారి 'ఎడారిలో వానచినుకు' నాటికలు ఆద్యంతం అలరించాయి.

శ్రీకౌశికి జ్యూయలర్స్ ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ధర్మాన గజలక్ష్మి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సిక్కోలు ప్రజల అభిరుచికి తగ్గట్టుగా సరికొత్త బంగారు ఆభరణాలు శ్రీకౌశికి జ్యూయలర్స్ (ఎస్‌కేజే)లో లభిస్తాయని మంత్రి ధర్మాన ప్రసాదరావు సతీమణి గజలక్ష్మి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఎస్‌కేజే షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేర్ల సాంబమూర్తి బంగారం వ్యాపారంలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, నాయకులు మండవల్లి రవి, గుండ లక్ష్మీదేవి, కూన రవికుమార్, గొండు శంకర్, వ్యాపారులు పేర్ల సాంబమూర్తి, పేర్ల కిషన్‌మోహన్‌కుమార్, పేర్ల హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి జూనియర్ కాలేజీలకు సెలవులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ విద్య అందిస్తున్న జూనియర్ కాలేజీలు శుక్రవారం నుంచి మూతపడనున్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికిగాను అకడమిక్ క్యాలెండర్ ప్రకారం 2023 జూన్ ఒకటో తేదీన జూనియర్ కళాశాలలు పునఃప్రారంభమై 2024 మార్చి 28వ తేన ఆఖరి పనిదినంగా నిర్ణయించారు. దీంతో శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించారు. వేసవి సెలవులు మే 31 వరకు ప్రకటించారు. మొత్తం 302 రోజులకుగాను 75 సెలవు దినాలుకాగా.. 227 రోజులు పనిదినాలుగా కళాశాలలు పనిచేశాయి. మార్చి 18 వరకు పబ్లిక్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.

ఆదిత్యాలయ అటెండర్ సస్పెన్షన్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రెగ్యులర్ అటెండర్‌గా పనిచేస్తున్న శిమ్మ భాస్కరరావును విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ గురువారం తెలిపారు. కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆలయంలో పనిచేస్తున్న రెగ్యులర్ / దినసరి వేతన ఉద్యోగులు కూడా కచ్చితంగా విధులు సక్రమంగా నిర్వర్తించాలని, సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.